# అన్ని వర్గాల సంక్షేమానికి సీఎం కేసీఆర్ కృషి

- ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి
- నల్లగొండ జిల్లా కేంద్రంలో ఎన్నికల ప్రచారం

నల్లగొండ, అక్టోబర్ 27: అన్ని వర్గాల సంక్షేమానికి సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారని, అభివృద్ధి చేసే బీఆర్ఎస్‌కు మరోసారి పట్టం కట్టాలని నల్లగొండ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన శుక్రవారం నల్లగొండ పట్టణంలోని 35,36,37వ వార్డుల్లో ప్రచారం నిర్వహించి కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. తాను నల్లగొండ ఎమ్మెల్యేగా ఎన్నికైన దగ్గర నుంచి నిత్యం ప్రజల కష్టాలు తెలుసుకుని పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. నల్లగొండను రూ.1,450 కోట్లతో అభివృద్ధి చేస్తున్నానని మరో రెండేండ్లలో ఆ పనులు పూర్తి అయ్యే అవకాశం ఉన్నందున మరోసారి తనను ఎమ్మెల్యేగా గెలిపించాలని ఆయన ప్రజలను కోరారు. బీఆర్ఎస్ మ్యానిఫెస్టోతో అన్ని వర్గాల ప్రజలకు మేలు జరుగుతుందన్నారు.



నల్లగొండ 35వ వార్డులో మహిళను ఓటు అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి

### మహిళల నీరాజనం..

బీఆర్ఎస్ అభ్యర్థిగా మరోసారి గెలిపించాలని కోరుతూ ఆయా కాలనీల్లో ప్రజలు కంచర్ల భూపాల్ రెడ్డి చేపడుతున్న ప్రచారానికి అపూర్వ స్వాగతం లభిస్తుంది. ప్రధానంగా మహిళలు హారతులు ఇస్తూ నీరాజనం పలుకుతూ బ్రహ్మరథం పడుతున్నారు. ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం వేళలో చేపట్టే ప్రచారానికి కాలనీల నుంచి విశేష స్పందన లభిస్తుండగా డప్పు చప్పుళ్ల కాలనీల్లో ప్రచారం ఉర్రూతలూగిస్తున్నారు. ఆయా కార్యక్రమాల్లో 35వ వార్డు కౌన్సిలర్ గుర్రం ధనలక్ష్మి, వెంకన్న, మాజీ కౌన్సిలర్ మిర్యాల యాదగిరి, తరాల యాదగిరి, చక్రవర్తి, రాజేందర్, సింగిరి కొండ శివశంకర్, శ్యాంసుందర్, దోనాల నాగార్జున రెడ్డి పాల్గొన్నారు.



బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి ప్రసంగిస్తున్న సమయంలోసభలో ఖాళీగా దర్శనమిస్తున్న కుర్చీలు

# అమిత్ షా సభ అట్టర్ ప్లాప్

- సూర్యాపేటలో జనం లేని బీజేపీ సభ
- 30 వేలు అనుకుంటే 10 వేలు కూడా మించని జనం
- నాలుగు నియోజక వర్గాల నుంచి వచ్చినా ఖాళీ కుర్చీలే దర్శనం
- 12 నిమిషాలకే ప్రసంగం ముగించిన అమిత్ షా

సూర్యాపేట, అక్టోబర్ 27 (నమస్తే తెలంగాణ) : సూర్యాపేటలో భారీ అంచనాలతో బీజేపీ నిర్వహించిన జన గర్జన సభ అట్టర్ ప్లాప్ అయింది. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ముఖ్య అతిథిగా హాజరు కావడంతో భారీ అంచనా, వ్యయంతో ఏర్పాటు చేసిన సభ వెలవెలబోయింది. దాదాపు 30 వేల మంది జనం వస్తారని ఆ మేరకు కుర్చీలు ఏర్పాటు చేయగా వారి అంచనాలు తలకిందులై 10 వేలకు మించి రాలేదు. అసలే తక్కువ సంఖ్యలో జనం రాగా వారు సైతం అమిత్ షా ప్రసంగాన్ని ఆసాంతం వినకుండా బారికేడ్లను తొలగించుకుని మధ్యలోనే వెళ్లిపోవడం కనిపించింది. బీజేపీ కార్యకర్తలు కాసేపు ఉండాల్సిందిగా వేడుకున్నప్పటికీ వారు ఆగకుండా వెనుతిరిగి వెళ్లిపోయారు. జిల్లా వ్యాప్తంగా లారీల్లో జనాన్ని తరలించినా వేసిన కుర్చీలు ఖాళీగా కనిపించాయి. సూర్యాపేట బీజేపీ అభ్యర్థి సంకినేని వెంకటేశ్వర్‌రావు మొదలుకుని అమిత్ షా ప్రసంగిస్తున్న సమయాల్లో సభలో సింహభాగం ఖాళీ కుర్చీలే దర్శనమిచ్చాయి. ఖాళీ కుర్చీలకే తమ ప్రసంగాలను వినిపించిన పరిస్థితి. అమిత్ షా ప్రసంగం సైతం ఆకట్టుకోకపోవడంతో బీజేపీ శ్రేణులు నిరుత్సాహంతో కనిపించాయి. వాస్తవానికి అమిత్ షా ప్రసంగం 45 నిమిషాలు ఉండగా జనం లేకపోవడంతో 12 నిముషాల్లోనే ముగించి వెళ్లిపోయారు. జిల్లా వ్యాప్తంగా జనాన్ని తరలించినా 10 వేలకు మించకపోవడం పట్ల ఇలా ంటి సభలు ఎందుకు పెడుతారని అగ్ర నాయకులు ఆగ్రహం వ్యక్తం చేసినట్లు విశ్వసనీయ సమాచారం. మొత్తం మీద ఈ ప్రాంతంలో బీజేపీకి పట్టు లేకపోగా అమిత్ షా లాంటి అగ్ర నాయకులు వస్తే ఏదో జరుగుతుందనుకున్న ఆ పార్టీ నేతలు జన గర్జన సభ ప్లాప్ కావడంతో తీవ్ర నిరుత్సాహానికి లోనవుతున్నారు.




అవగాహన కల్పిస్తున్న కమాండెంట్ సత్యశ్రీనివాస్

### 12వ బెటాలియన్‌లో ఓపెన్ హౌస్

నీలగిరి, అక్టోబర్ 27. పోలీసుల అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం అన్నెపర్తిలోని 12వ బెటాలియన్‌లో కమాండెంట్ ఎన్వీ సత్యశ్రీనివాస్ ఆధ్వర్యంలో ఓపెన్ హౌస్ నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులకు పోలీసులు విధి నిర్వహణలో ఉపయోగించే ఆయుధాలను వివరించారు. పోలీసులు విధి నిర్వహణలో ఎదుర్కొనే ఒత్తిడి వారి కుటుంబాల మీద ఎలాంటి ప్రభావం చూపుతుందో ఈసందర్భంగా కమాండె ంట్ విద్యార్థులకు వివరించారు. అనంతరం విద్యార్థులకు ఒత్తిడి ఏలా ఎదుర్కొవాలో సైకాలజిస్టు డాక్టర్ గంగాధర్ బారెడ్డి వివరించారు. కార్యక్రమంలో బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ బి.చంద్రశేఖర్ సిబ్బంది పాల్గొన్నారు.

### త్వైకాండో విజేతలకు అభినందన

రామగిరి, అక్టోబర్ 27: నల్లగొండలోని మహాత్మాగాంధీ యూనివర్సిటీలో శుక్రవారం నిర్వహించిన త్వైకాండో పోటీల్లో స్వర్ణపతకాలు సాధించిన నల్లగొండ మహిళ డిగ్రీ కళాశాల విద్యార్థినులు సరయూ, మేఘనను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఘన్‌శ్యాం శుక్రవారం అభినందించారు. ఎంజీయూ మహిళా టీమ్ ఎంపిక కావడంతోపాటు నవంబర్‌లో జరిగే జాతీయ స్థాయి వెస్ట్‌జోన్ పోటీలకు వెళ్లడం గర్వంగా ఉందని ఆయన పేర్కొన్నారు. విద్యార్థినులను అభినందించిన వారిలో కళాశాల ఇన్‌చార్జీ పీడీ డాక్టర్ సుంకరి రాజారాం, పరీక్షల నియంత్రణాధికారి వెంకటకృష్ణ, అధ్యాపకులు భాస్కర్‌రెడ్డి, నరేశ్ ఉన్నారు.

# సమష్టి కృషితో డీసీసీబీ లాభాల్లోకి..

- వైస్ చైర్మన్ ఎసిరెడ్డి దయాకర్ రెడ్డి

నల్లగొండ, అక్టోబర్ 27:పాలక వర్గంతో పాటు ఉద్యోగులు చేసిన సమష్టి కృషి మూలంగానే డీసీసీబీ లాభాల్లోకి వచ్చినట్లు వైస్ చైర్మన్ ఎసిరెడ్డి దయాకర్ రెడ్డి అన్నారు. డీసీసీబీలో శుక్రవారం జరిగిన మహాజన సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ద్వారా పంట రుణాలు ఇవ్వడంతో పాటు కమర్షియల్ రుణాలు ఇవ్వడం వల్లనే మంచి లాభాలు సాధిస్తున్నామన్నారు. రైతులు, ఖాతాలకు మెరుగైన రుణాలు ఇవ్వడంతో పాటు విద్యారుణాలు, వ్యక్తి గత, బిజినెస్, మార్టిగేజ్ రుణాలు అందిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో సీఈఓ మదన్ మోహన్, డైరెక్టర్లు, పీఏసీఎస్ చైర్మన్లు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీసీసీబీ వైస్ చైర్మన్ దయాకర్‌రెడ్డి

### హరిహరులకు నిత్యారాధనలు

మఠంపల్లి, అక్టోబర్ 27 : మండలంలోని మట్టపల్లి లక్ష్మీనరసింహ స్వామి క్షేత్రంలో హరిహరులకు నిత్యారాధనలను అర్చకులు శుక్రవారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ముందుగా స్వామి, అమ్మవార్లకు పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించి పట్టు వస్త్రాలతో అలంకరించారు. కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్త చెన్నూరి విజయ్‌కుమార్, ఈఓ నవీన్, ఆలయ అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

### తాళం వేసిన ఇంట్లో చోరీ

- 3తులాల బంగారం, నగదు అపహరణ

నేరేడుచర్ల, అక్టోబర్ 27 : తాళం వేసిన ఇంట్లో దొంగలు పడి బంగారం, నగదు దోచుకెళ్లిన సంఘటన మున్సిపాలిటీ పరిధిలోని నర్సయ్యగూడెంలో శుక్రవారం జరిగింది. ఎస్ఐ పరమేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. నర్సయ్యగూడేనికి చెందిన పెద్ది అప్పిరెడ్డి, కనకమ్మలు ఇంటికి తాళం వేసి ఈ నెల 23న నేరేడుచర్ల మున్సిపాలిటీ పరిధిలోని రామగిరిలో నివాసముంటున్న రెండో కూతురు లలిత ఇంటికి దసరా పండుగకు వెళ్లారు. తిరిగి శుక్రవారం ఉదయం ఇంటికి వచ్చే సరికి తలుపులు తీసి ఉండడం గమనించి ఇంట్లో దొంగలు పడినట్లు గుర్తించారు. లోపలికి వెళ్లి చూడగా బీరువాలో ఉన్న 3తులాల బంగారు ఆభరణాలు, రూ.20వేల నగదు ఎత్తుకుపోయినట్లు తెలిపారు. బాధితుడు అప్పిరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

### సీఎం కేసీఆర్ బహిరంగ సభను జయప్రదం చేయాలి

- బీఆర్ఎస్ మండల ఇన్‌చార్జి లక్ష్మీనారాయణ

గరిడేపల్లి, అక్టోబర్ 27 : హుజూర్‌నగర్‌లో ఈ నెల 31న నిర్వహించే సీఎం కేసీఆర్ బహిరంగ సభకు మండలం నుంచి అధిక సంఖ్యలో నాయకులు తరలివెళ్లి జయప్రదం చేయాలని బీఆర్ఎస్ మండల ఇన్‌చార్జి తాళ్లూరి లక్ష్మీనారాయణ కోరారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఆయన మరో మండల ఇన్‌చార్జి అన్నపురెడ్డి నారాయణ రెడ్డితో కలిసి ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో సకల జనులు సంతోషంగా ఉన్నారన్నారు. సమావేశంలో జడ్పీటీసీ పోరెడ్డి శైలజారవీందర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ గుత్తికొండ ప్రమీలా వెంకటరమణారెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ కడియం వెంకట్‌రెడ్డి, గరిడేపల్లి గ్రామ అధ్యక్షుడు ప్రధాని సైదులు, సర్పంచ్ టి.సీతారాంరెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీలు, గ్రామశాఖ అధ్యక్షులు, బూత్ కమిటీల సభ్యులు, సోషల్ మీడియా సభ్యులు పాల్గొన్నారు.

# కొనుగోలు కేంద్రాల్లో ఇబ్బందుల్లేకుండా చూడాలి

- డీఎస్ఓ వెంకటేశ్వర్లు

నల్లగొండ రూరల్, అక్టోబర్ 27: ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా నిర్వాహకులు చర్యలు తీసుకోవాలని డీఎస్ఓ వెంకటేశ్వర్లు అన్నారు. మండలంలోని రెడ్డికాలనీ, చందనపల్లి గ్రామాల్లో అన్నదాత సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను శుక్రవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. కొనుగోలు కేంద్రాల్లో ప్యాడీ క్లీనర్ సాయం ధాన్యంతూర్పార పట్టడం పట్ల అభినందించారు. ధాన్యం 17 శాతం తేమ ఉండేలా చూ లన్నారు. ఎప్పటికప్పుడు ట్యాబ్‌లో ఆన్‌లైన్ చేసి సకాలంలో రైతులకు డబ్బులు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట సివిల్ సప్లయి ఆర్ఐ లింగస్వామి, సెంటర్ నిర్వాహకులు గాదె రాజశేఖర్‌రెడ్డి, కసర్ల అంజిరెడ్డి, రైతులు ఉన్నారు.



చిట్యాల : కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు

### ధాన్యం కొనుగోలు కేంద్రాల పరిశీలన

చిట్యాల :ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ఆధ్వర్యంలో చిట్యాల, ఉరుమడ్లలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను పౌరసరఫరాల శాఖ అధికారులు పరిశీలించారు . శుక్రవారం డీ ఎస్ఓ వెంకటేశ్వర్లు ఆయా కేంద్రాలను పరిశీలించి రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూసుకోవాలని నిర్వాహకులకు సూచించారు. రైతుల వివరాలను ట్యాబ్‌లలో నమోదు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డీఎం నాగేశ్వర్ రావు, ఆర్ఐ లింగస్వామి, సీఈఓ బ్రహ్మాచారి, కొనుగోలు కేంద్రాల ఇన్‌చార్జి నాగరాజు పాల్గొన్నారు.

### అక్కెనపల్లిలో..

నార్కట్‌పల్లి : మండలంలోని అక్కెనపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని డీఆర్‌డీఓ ఏపీడీ సరస్వతి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు కేంద్రానికి ధాన్యాన్ని తూర్పారబట్టి తీసుకొని రావాలని, తేమ 17శాతం లోపు తీసుకురావాలని అన్నారు. కార్యక్రమంలో డీపీఎం మోహన్ రెడ్డి, ఏపీయం మైసేశ్వర రావు, సీసీ రమాదేవి, సీఆర్పీ స్వాతి, కావ్య, వీఓఏ సుజాత పాల్గొన్నారు.



నార్కట్‌పల్లి: అక్కెనపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఏపీడీ సరస్వతి